క్లుప్తంగా

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

నాగాయలంక: బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు బుధవారం నాగాయలంక మండలంలో పర్యటిస్తారని అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఉదయం 10 గంటలకు సొర్లగొందిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభిస్తారు. అనంతరం దీనదయాళపురం, దిండి గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు, మధ్యాహ్నం తలగడదీవి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ప్రారంభిస్తారని వివరించారు.

దుర్గమ్మ ప్రతిమల నిమజ్జనం

కోడూరు: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండలంలోని నరసింహపురం, పోటుమీద, కోడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ మంగళవారం అమ్మవార్లకు ప్రత్యేక వాహనాలపై గ్రామోత్సవం జరిపారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారికి నీటిని వారబోసి భక్తి భావం చాటుకున్నారు. దుర్గమ్మ విగ్రహాలను ఉల్లిపాలెం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

వ్యాన్ ఢీకొని ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు



కాసానగర్(మోపిదేవి): వ్యాన్ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మండల పరిధిలోని కాసానగర్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. వేకనూరుకు చెందిన ఆటోడ్రైవర్ తుంగల లక్ష్మీకాంతారావు చల్లపల్లి నుంచి అవనిగడ్డ వైపు వెళుతుండగా కాసానగర్ మలుపు వద్ద మచిలీపట్నం నుంచి నెల్లూరు వైపు వెళుతున్న వ్యాన్ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మీకాంతారావును 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2న స్పర్శ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం

పెడన: పెడన మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 2న ఉదయం 10.30 గంటలకు స్థానిక 16 వార్డులోని పెడన మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో స్పర్శ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తారని సంఘం అధ్యక్షులు అబ్దుల్ సలాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. భారత దేశ త్రివిధ దళాల్లో పనిచేసిన సైనికులు డాక్యుమెంట్లు తమ వెంట తీసుకురావాలన్నారు. దీంతోపాటు మాజీ సైనికులు తమ మొబైల్ నంబర్‌ను ఆధార్‌కి లింక్ చేయించుకొని నిర్ధారణ చేసుకొని రావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 98483 16677 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కార్నియాల సేకరణ

చల్లపల్లి: స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన తమ్మన చలమయ్య కుమారుడు నాగ వెంకట సుధీర్ (32) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. నేత్రదానం ఆవశ్యకతను చలమయ్యకు వాసవీక్లబ్ చల్లపల్లి అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు వివరించగా అంగీకరించారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది వచ్చి సుధీర్ నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తరలించారు.

కమనీయం శాంతి కల్యాణం

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత, కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం పార్వతీ నగరేశ్వరస్వామి శాంతి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో తాడికొండ లక్ష్మీనారాయణ, వెంకట సీతామహాలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. ఆలయంలో కన్యకాంబ, పార్వతీ అమ్మవార్లు శ్రీపుష్ప శయన అలంకారంలో దర్శనమిచ్చారు. దాతల సహకారంతో కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సోమ వారం రాత్రి గణపేశ్వరంలోని దుర్గా–గణపేశ్వరస్వామి, కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రంలోని కనక దుర్గమ్మ, భావదేవరపల్లిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, నాగా యలంక కన్యకా పరమేశ్వరి అలయాలలో భక్తిశ్రద్ధలతో జరిపిన శమీపూజలతో మండలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి.

జగన్మాతా.. పాహిమాం



రాజరాజేశ్వరీదేవి అలంకారంలో కోడూరు గంగాభవానీ అమ్మవారు



విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అలంకరణ



అడ్డపర్ర కనకదుర్గాలయంలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు



మహిషాసురమర్దినీ దేవిగా పెడన పైడమ్మ అమ్మవారు



రాజరాజేశ్వరిదేవిగా పెడన కన్యకాపరమేశ్వరి అమ్మవారు



ఈడేపల్లి కృష్ణగారి శక్తిగుడి కాళికా అమ్మవారి ఊరేగింపు



పాగోలులో శమీవృక్ష పూజ

కోడూరు/పెడన/మచిలీపట్నం టౌన్: అవనిగడ్డ, పెడన, మచిలీపట్నంలో ఇంటింటి దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సమీప ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం, మంగళవారాలు అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పలుచోట్ల సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాల ధర్మకర్తలు, కమిటీల నిర్వాహకులు పర్యవేక్షించారు. పలుచోట్ల అన్నసమారాధనలు జరిగాయి. కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారి తెప్పోత్సం కనులపండువగా జరిగింది.



బంటుమిల్లిలో కన్యకాపరమేశ్వరి అలంకారంలో అమ్మవారు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో విజయలక్ష్మీ దేవిగా అమ్మవారు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా పార్వతీదేవి

రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



రైతులతో కలిసి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వెన్నుదన్నుగా నిలిచిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పాదాలవారిపాలెం నాలుగో నంబర్ పంటకాలువకు జరుగుతున్న పూడికతీత పనులను రమేష్‌బాబు పరిశీలించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని అందించినా కూడా వర్షాల లేకపోవడంతో దిగువకు పూర్తిస్థాయిలో సాగునీరు చేరడం కష్టంగా మారిందని రమేష్‌బాబు అన్నారు. 60 శాతం కాలువ నీరు, 40 శాతం వర్షంపై ఆధారపడి ప్రతి సంవత్సరం పంట సాగవుతుందని, కాని నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. కనిష్ట వర్షపాతం కూడా నమోదు కాకపోయినా కూడా పొలాలకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వంతులవారీ విధానం సక్రమంగా అమలు జరిగేలా ఇరిగేషన్ అధికారులు పని చేస్తున్నారన్నారు.

సొంత నిధులతో మోటర్ల ఏర్పాట్లు

ఎమ్మెల్యే రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు సొంత నిధులతో ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ మోటర్లను రమేష్‌బాబు ప్రారంభించారు. నాలుగో నెంబర్ పంటకాలువ పూడికతీతను కూడా సొంత ఖర్చులతో చేయిస్తున్న రమేష్‌బాబు, నరసింహారావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రత్నకోడు డ్రైయిన్‌లోని నీరు నేరుగా కాలువలోకి వచ్చేందుకు మోటర్ల ఏర్పాటు చేశామని, పూడికతీత ద్వారా నీరు పుష్కలంగా దిగువకు వెళ్తుందని రమేష్‌బాబు తెలిపారు. అనంతరం పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధర్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వెన్నా ప్రసాద్, బీసీ, మత్స్యకార నేతలు పరిశె భిక్షాలు, చిలకలపూడి ధర్మయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ శాఖ నూతన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

చల్లపల్లి: నియోజకవర్గంలో ప్రతి రైతుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో రూ.19.95 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రెయినేజీ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ నూతన కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీ కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ సాధ్యమైనంత మేరకు పంట కాలువల సామర్థ్యం పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పండగకు కొత్త రోడ్డు



నాడు : గుంతలమయంగా పెడన-గూడూరు రోడ్డు

గూడూరు: దసరా పండుగకు తమ ఊరికి కొత్త రోడ్డు వచ్చిందని గూడూరు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గూడూరులోని యాదవుల బజారు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ కూడలి వరకు రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. అడుగడుగునా గోతుల మయంగా మారి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్పందించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారు. దీంతో గతంలో ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించి పూర్తిస్థాయి బీటీ రోడ్డుగా నిర్మించారు. గత ఏప్రిల్‌లో రోడ్డు నిర్మాణ పనులకు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. దశల వారిగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు దసరా పండుగ రోజున పూర్తయ్యాయి. దీంతో దసరా పండగకు మా ఊరికి కొత్త రోడ్డు వచ్చిందంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నేడు : నిర్మాణ పనులు పూర్తయిన పెడన-గూడూరు రోడ్డు

26న విద్యుత్ అదాలత్

మచిలీపట్నంటౌన్: విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తామని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పోతేపల్లి జ్యూయలరీ పార్కు వద్ద ఉన్న జ్యూయలరీ అసోసియేషన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎన్. విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, ఎలక్ట్రికల్ ఎస్‌ఈ, విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన వాటిపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చునని చెప్పారు.

దుస్తుల పంపిణీ

పాతపాడు(విజయవాడరూరల్): దసరా పండుగను పురస్కరించుకొని పాతపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక నేత కలపాల అబ్రహాం దుస్తులను పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

సుబ్బారాయుడి గ్రామోత్సవం



మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి సెమీ వృక్ష పూజ, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం దుర్గామాత అమ్మవారిని మహిషాసురమర్దినీదేవిగా, రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఆలయ ఏసీ ఎన్ ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

1,500 మందికి అన్నసమారాధన



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు తూర్పు బజారు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి ఉదయం అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, ఎస్‌ఐ సీహెచ్ పద్మ గ్రామస్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, ఎస్‌ఐలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- నాగాయలంక: స్థానిక బోస్ బొమ్మ కూడలిలోని పోతురాజుస్వామి దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సౌజన్యంతో 200 మందికి మంగళవారం అన్నదానం చేశారు. అవనిగడ్డ మండలం బందలాయిచెర్వు గ్రామస్తుడైన విశ్రాంత అధ్యాపకుడు సింహాద్రి మోహన్‌దాస్ మనుమరాలు సింహాద్రి మేఘన నేతృత్వంలో నౌరిష్ అండ్ ఫ్లొరిష్ (యుఎస్ఏ)సంస్థ తరఫున ఈ కార్యక్రమం నిర్వహించారు.

బాధితులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

అవనిగడ్డ: మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కె. కొత్తపాలెంకు చెందిన ఎస్టీ బాధిత మహిళలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు సోమవారం పరామర్శించారు. కె కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్తి రాజా చంద్ తమ ఇంట్లో బంగారు వస్తువులు దొంగిలించారనే ఆరోపణతో రాచూరి దుర్గాదేవి, ఆమె పిన్ని కోనేటి పద్మను కొట్టి గాయపరచడంతో తొలుత అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు వెన్నా ప్రసాద్ బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

పంటపొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధి పెదపట్నం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు శివారు ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు సరిగా అందడం లేదని చెప్పడంతో రైతులతో కలిసి ఆయన పొలాలను పరిశీలించారు. పంటబోదెలను పరిశీలించిన కిట్టు డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. శివారు పొలాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెదపట్నం సర్పంచ్ గడిదేసి అనూష, గ్రామ ఇన్‌చార్జి గడిదేసి రాజు, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేసి బాల జేసు, రైతులు శివాజీ, ఎర్రంశెట్టి రాము, మందపాటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



● కోనేరు సెంటర్ కిటకిట



దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందకు పైగా చిన్నా, పెద్ద శక్తిపటాలను ఊరేగించారు. డీజె సౌండ్స్, వాయిద్యాలు, బేతాళ నృత్యాల మధ్య పటాల ఊరేగింపు మంగళవారం తెల్లవారుజామున కోనేరుసెంటర్‌కు చేరుకుంది. అనంతరం శమీ పూజ నిర్వహించారు. శక్తి పటాల ఊరేగింపును తిలకించేందుకు వచ్చిన ప్రజలతో కోనేరు సెంటర్ కిటకిటలాడింది.

-మచిలీపట్నంటౌన్

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబాకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కోడూరు: సాయిబాబా మహా సమాధి చెందిన రోజును పురస్కరించుకొని కోడూరు షిర్డీ సాయి దివ్య ధాన్యజ్ఞాన మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబా విగ్రహానికి గో క్షీరాభిషేకం చేశారు. భక్తులే స్వయంగా స్వామివారికి అభిషేకం చేసే అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేక పల్లకీలో ఊరేగిస్తూ నగరోత్సవం జరిపారు. వేదపండితుల మంత్రవచనాల నడుమ బాబా పాదుకలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు.

కనుల పండువగా దుర్గమ్మ జల విహారం



నాగాయలంక: స్థానిక కృష్ణానదీతీరంలోని శ్రీరామ పాదక్షేత్రం కనకదుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కృష్ణమ్మ ఒడిలో కనకదుర్గమ్మ జల విహార తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రెండు నావల హంస వాహనంపై విద్యుత్ దీప కాంతుల నడుమ అమ్మవారు కృష్ణానదిలో విహారం చేశారు. శ్రీరామపాద క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో అమ్మవారి నదీ విహారంలో బాణసంచా వెలుగుల నడుమ తెప్పోత్సవం జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలో మద్దూరి శ్రీనివాసశాస్త్రి బ్రహ్మత్వంలో వేములపల్లి హేమప్రసాద్, లక్ష్మీశివపార్వతి దంపతులు శమీవృక్షం, తెప్పోత్సవ పూజలు జరిపారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరులు పాల్గొన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలంకార ఉభయ దాతలుగా బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, గాంధీకుమారి దంపతులు వ్యవహరించారు.